సాక్షి
బాపట్ల
గురువారం : 16 : మార్చి : 2023



పౌష్టికాహార కిట్లు అందజేత

నరసరావుపేట: నిక్షయమిత్ర పథకం ద్వారా రెండవ విడత పౌష్టికాహార కిట్లను సుమారు 600 మంది టీబీ పేషెంట్లకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5,600, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,400 వరకు పలికింది.



పార్థసారథి అలంకారం

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారు పార్థసారథి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నృసింహస్వామిని దర్శించుకున్న పీఠాధిపతి



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీనృసింహస్వామి వారిని బుధవారం బెంగళూరుకు చెందిన ఉత్తరాధి మఠం సత్యాత్ మతీర్థ స్వామి వారు దర్శించుకున్నారు. పీఠాధిపతికి ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి భక్తులకు ప్రవచనాలను తెలియజేశారు.

రిగ్గులు, బోర్ సెట్లకు రిజిస్ట్రేషన్లు చేయించాలి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని రిగ్గులు, హ్యాండ్ బోర్ సెట్ల యజమానులు ఈ నెల 31లోపు రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ చేయించుకోవాలని జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారి డి.వందనం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ జీఓను అనుసరించి నిబంధనలు పాటించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించకుండా గడువుదాటిన తర్వాత పనులు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయం ఫోన్ నెంబర్ 0863-2230767లో సంప్రదించాలన్నారు.

యార్డులో 1,10,118 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,05,583 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,10,118 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 86,556 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఎంపీహెచ్‌ఏ కౌన్సెలింగ్ వాయిదా

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ- మేల్)లకు గురువారం జరగాల్సిన కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు బుధవారం తెలిపారు. ఎంపీహెచ్‌ఏలకు త్వరలోనే ప్రమోషన్ కౌన్సెలింగ్ ఉన్న నేపథ్యంలో కొన్ని ఖాళీలు ఏర్పడతాయని, అందువల్ల ప్రమోషన్ కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. అభ్యర్థులకు కౌన్సెలింగ్ వాయిదా పడిన విషయం ఎస్‌ఎంఎస్‌ల ద్వారా తెలియజేస్తున్నామన్నారు.

పులిచింతల నీటి నిల్వ



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.0123 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 537.30 అడుగుల వద్ద ఉంది. ఇది 182.7483 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 6,553, ఎడమకాలువకు 8,807, ఎస్‌ఎల్‌బీసీకి 2,000, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం అవుట్‌ఫ్లోగా 14,780 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 816.60 అడుగుల వద్ద ఉంది. ఇది 38.4044 టీఎంసీలకు సమానం.

దిగుబడులకు కృత్రిమ తోవ

పలు సంచలనాలకు కారణమై, ప్రపంచాన్ని ఒక ఊపు ఊపేస్తున్న కృత్రిమ మేధ వ్యవసాయ రంగంలోనూ రైతులకు ఉపయుక్తంగా మారింది. జీడిమామిడి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా శాస్త్రవేత్తలు రూపొందిస్తున్న ఓ యాప్ కృత్రిమ మేధతో పనిచేస్తూ చెట్ల ఆకుల, పండ్ల స్వభావాన్ని బట్టి చీడపీడలను గుర్తించి, కావాల్సిన పోషకాలు అందించే మందులను సిఫారసు చేయనుండడం విశేషం.

– బాపట్ల



జీడి మామిడి చెట్టు

- జీడి మామిడిలో తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు కృత్రిమ మేధ సాయం
- మొబైల్ యాప్ రూపొందించిన నిపుణులు
- ఫొటోల అప్‌లోడ్‌తో చీడపీడల తాకిడి, పోషకాల లోపం గుర్తింపు
- త్వరలో రైతులకు అందుబాటులోకి వస్తుందంటున్న శాస్త్రవేత్తలు



తెగులు వ్యాపించిన జీడిమామిడి



ప్రధాన శాస్త్రవేత్త
కె.ఉమామహేశ్వరరావు

ప్రపంచంలో ఆహార పదార్థాల తయారీలో అత్యధికంగా వినియోగించే జీడిపప్పుకు మంచి గిరాకీ ఉంది. జీడిపప్పు వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని అధిక దిగుబడులు సాధించేందుకు అనువైన వంగడాలతో పాటు జీడి మామిడిపై ఆశించే చీడపీడలను ముందస్తుగానే గుర్తించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు మొబైల్ యాప్‌ను రూపొందించారని బాపట్ల జీడి మామిడి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే జీడిమామిడి పంటలో తెగుళ్లు, చీడపీడల తాకిడి పోషకాల లోపాలను గుర్తించేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత (ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కృత్రిమ మేధ వెబ్‌సైట్ మొబైల్ యాప్‌ను వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించారన్నారు.

తెలుగులోనూ యాప్...

రాష్ట్రంలో జీడిమామిడి సాగుచేసే రైతులకు మరింత మెరుగైన అవగాహన కోసం ఈ యాప్‌ను తెలుగు భాషలో కూడా అందుబాటులో ఉంచారు. ఈ యాప్ రూపకల్పనలో జీడిమామిడి పరిశోధన స్థానం, బాపట్ల, అఖిల భారత సమన్వయ జీడి మామిడి పరిశోధన పథకం, వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పాల్గొన్నారన్నారు. తెలుగు భాషను చేర్చడంతో ఉభయ రాష్ట్రాల్లోని జీడి మామిడి రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ యాప్‌ను భారత వ్యవసాయ పరిశోధన మండలి – జీడిమామిడి పరిశోధన సంచాలయం పుత్తూరు, కర్ణాటక రాష్ట్రం అభివృద్ధి చేసిందన్నారు. రాష్ట్రంలో రైతులు సులభంగా అర్థం చేసుకునేందుకు తెలుగు భాషను వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం చేర్చిందని ఉమామహేశ్వరరావు వివరించారు.

సమగ్ర సమాచారం..

జీడిమామిడి ఫలసాయంలో పోషకాహార లోపాలతో పాటు తెగుళ్లు, చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులు వ్యవసాయ నిపుణుల సలహాల కోసం ఎదురు చూడకుండానే కృత్రిమ మేధతో పనిచేసే యాప్‌లు రైతులకు ఎంతగానో సహాయ పడతాయన్నారు. ఈ యాప్‌లో సాంకేతిక పరిజ్ఞానంతో పొందుపరిచిన చిత్రాల ద్వారా దాదాపు 60శాతం జీడిమామిడిని ఆశించే తెగుళ్లు, 20శాతం చీడపీడలు, 10 శాతం పోషక లోపాలను తక్షణమే నిర్ధారించడం జరుగుతుందన్నారు. అయితే ప్రయోగాత్మకంగా మొదటి దశలో 6 శాతం తెగుళ్లు, ఒకశాతం చీడపీడలను గుర్తిస్తుందన్నారు. రానున్న రోజుల్లో దీన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు బాపట్ల అఖిలభారత సమన్వయ జీడిమామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలను సంప్రదించాలని సూచించారు.

భూహక్కు పత్రాల ప్రకారం హద్దురాళ్లు

రీసర్వే భూములను పరిశీలించిన కలెక్టర్ కె.విజయకృష్ణన్



కేశవరప్పాడులో భూసర్వే హద్దు రాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కేశవరప్పాడు (కారంచేడు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమం ద్వారా రైతులకు, ప్రజలకు ఎంతో మంచి జరుగుతుందని బాపట్ల కలెక్టర్ కె.విజయకృష్ణన్ అన్నారు. బుధవారం కేశవరప్పాడులో ఇటీవల నిర్వహించిన రీ సర్వే ప్రకారం కేటాయించిన భూహక్కు పత్రాల ఆధారంగా ఏర్పాటు చేస్తున్న హద్దురాళ్ల (స్టోన్ ప్లాంటేషన్) ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో కేశవర్పాడు, దగ్గుబాడు గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. మొదటి ఫేజ్‌లో భాగంగా కేశవరప్పాడులో డ్రోన్ సర్వేలను పటిష్టంగా నిర్వహించామన్నారు. సర్వే పూర్తి అయిన తరువాత ప్రస్తుతం ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ నంబర్) ప్రకారంగా హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రైతులకు ఎలాంటి అభ్యంతరంలు లేకుండా ఈ హద్దు రాళ్ల ఏర్పాటు ముమ్మరంగా జరిగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం, సర్వే సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం చేలల్లో మిరప కాయలు కోస్తున్న మహిళా కూలీలతో ముచ్చటించారు. ఎంత కూలి వస్తుంది, పనులు ఎలా ఉంటాయో అడిగి తెలుసుకున్నారు.

సచివాలయం తనిఖీ..

స్వర్ణ (కారంచేడు): గ్రామాల్లోని సచివాలయ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు మేలు జరిగేలా అందులో పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. బుధవారం స్వర్ణ-1 గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఇమ్యూనైజేషన్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. గర్భిణుల్లో రక్తహీనత ఉండకూడదన్నారు. అనంతరం ఆమె అక్కడే ఉన్న హోమియో వైద్యశాలను పరిశీలించారు. కార్యదర్శి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగంలోకి పారిశ్రామికవాడ

కృషి చేస్తామన్న జేసీ శ్రీనివాసులు



రెవెన్యూ అధికారులకు సూచనలు అందిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చీరాల టౌన్: మండలంలోని ఈపూరుపాలెం శివారు ప్రాంతంలో ఉన్న ఏపీఐఐసీ (పారిశ్రామిక వాడ) భూములను త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఈపూరుపాలెంలో ఉన్న ఏపీఐఐసీ భూములను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా జేసీ రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. విలువైన భూమి నిరుపయోగంగా ఉండటం సరికాదని, కొద్ది రోజుల్లోనే పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయడంతో పాటు వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఆటోనగర్ ఏర్పాటులో జాప్యం లేకుండా ప్రభుత్వానికి నివేదికలను అందించి పరిష్కారం చూపుతామన్నారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, మండల సర్వేయర్ లోకేష్, వీఆర్‌ఓలు, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

27న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలి: తపాలశాఖ, విజయవాడ రీజియన్ ఆదేశాల ప్రకారం తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 27న డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆరోజు సాయంత్రం 4 గంటలకు జరిగే డాక్ అదాలత్‌కు హాజరు కావాలని తపాల అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయంగా హాజరు కాలేనివారు 24వ తేదీలోగా తమ ఫిర్యాదులను 'డాక్‌అదాలత్' అని రాసిన కవరులో ది సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, తెనాలి డివిజన్, తెనాలి-522 201 చిరునామాకు పంపాలని కోరారు.

29న రీజియన్ కార్యాలయంలో ...

29న తపాలశాఖ విజయవాడ రీజియన్ కార్యాలయంలో డాక్ అదాలత్ ఉంటుందని తెలిపారు. తపాల సేవలపై ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్టయితే ఆరోజున విజయవాడ గాంధీనగర్‌లో శాంతి, ప్రశాంతి థియేటర్ దగ్గర్లోని గాంధీనగర్ పోస్టాఫీసు పైఅంతస్తులోని పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ రీజియన్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. రాలేని వారు పోస్ట్‌మాస్టర్ జనరల్, విజయవాడ రీజియన్, విజయవాడ-520003 చిరునామాకు పంపాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు



గుంటూరు ఏసీ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

- మాల్ ప్రాక్టీసులకు తావులేని వాతావరణం
- ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 134 కేంద్రాల్లో 47,738 మంది హాజరు
- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పగడ్బందీగా నిర్వహణ
- పరీక్ష కేంద్రాల్లో అధికారుల విస్తృత తనిఖీలు
- గుంటూరులో కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



నరసరావుపేట ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల కేంద్రాన్ని సందర్శించిన పల్నాడు జేసీ శ్యాంప్రసాద్

బాపట్ల అర్బన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మాల్ ప్రాక్టీసులకు తావు లేని వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరు కావడం మంచి పరిణామం. బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో ప్రారంభమైన జూనియర్ ఇంటర్ పరీక్షలకు దరఖాస్తు చేసిన 48,985 మంది విద్యార్థుల్లో 47,738 హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచే కోలాహలం మొదలైంది. సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు చేసిన సూచనలతో విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. ఆలస్యంగా వచ్చిన కారణంగా విద్యార్థులెవ్వరూ వెనుదిరిగి వెళ్లలేదు. విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు చేర్చేందుకు ఆర్టీసీ అదనపు బస్సులు నడిపింది.

జిల్లాల వారీగా హాజరైన విద్యార్థులు

- గుంటూరు జిల్లాలో 73 కేంద్రాల పరిధిలో కేటాయించిన 29,922 మంది విద్యార్థుల్లో 29,329 మంది హాజరయ్యారు.
- పల్నాడు జిల్లాలోని 44 కేంద్రాల్లో 14,459 మంది విద్యార్థుల్లో 13,955 మంది హాజరయ్యారు.
- బాపట్ల జిల్లాలో 4,604 మంది విద్యార్థులకు 4,454 మంది హాజరయ్యారు.
- ఆర్ఐఓ జి. సునీత గుంటూరులోని ప్రభుత్వ బాలికల, వృత్తి విద్యా జూనియర్ కళాశాలల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.
- అదే విధంగా మూడు జిల్లాల డీవీఈఓలు 15 కేంద్రాలను తనిఖీ చేశారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మూడు జిల్లాల పరిధిలో 28 కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..

గుంటూరు సాంబశివపేటలోని ఇంటర్‌బోర్డు ఆర్ఐఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జూనియర్ ఇంటర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల పంపిణీ విషయమై ఆర్ఐఓ జి. సునీతను ఆరా తీశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పరీక్షల సరళిని పరిశీలించారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్ఓ కె. చంద్రశేఖరరావు, డీఈసీ సభ్యులు సుధాకర్‌బాబు, బాల మోహన్‌రావు, పాండురంగారావు ఉన్నారు.

విజ్ఞాన పండుగ అదరహో..!

విద్యార్థుల మేధస్సును పెంపొందించడం.. నూతన ఆవిష్కరణలను ప్రదర్శించడం.. వినూత్నతకు అవసరమైన ఆలోచనలకు నాందిపలకడం.. ఇవీ టూకీగా ఏఎన్‌యూలో ప్రారంభమైన అకడమిక్ ఎగ్జిబిషన్ ఉద్దేశం. ఈ విజ్ఞాన సంబరానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఉత్సాహంగా హాజరైన టెక్-విద్యార్థులు తమ ఆలోచింపజేసే ప్రదర్శనలతో వీక్షకులను ఆకట్టుకున్నారు. ఎగ్జిబిషన్ ఉద్దేశాన్ని సంపూర్తిగా నెరవేర్చారు..



సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మను సన్మానిస్తున్న ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్, అధ్యాపక బృందం

ఏఎన్‌యూలో అకడమిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

- ఆకట్టుకున్న వినూత్న ఆవిష్కరణలు
- ప్రారంభించిన సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ
- యూనివర్సిటీలో పండుగ వాతావరణం
- 180 స్టాల్స్‌లో 850 ప్రదర్శనలు
- ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు, సిబ్బంది

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం అకడమిక్ ఎగ్జిబిషన్ ప్రారంభమయింది. సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ అకడమిక్ ఎగ్జిబిషన్‌లో 180 స్టాల్స్‌లో 850కిపైగా పలు ప్రదర్శనలు చేయనున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కళాశాలల విభాగాలు, పరిశోధనా కేంద్రాలు, అనుబంధ కళాశాలలు, విజ్ఞాన్, విట్-ఏపీ, కేఎల్ యూతోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల లోని పలు ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఎగ్జిబిషన్‌లో పలు నూతన అంశాలపై ప్రదర్శనలు చేయనున్నాయి.

ఆకట్టుకున్న వినూత్న ఆవిష్కరణలు..

అకడమిక్ ఎగ్జిబిషన్‌లో తొలిరోజు చేసిన పలు ఆవిష్కరణలు, ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. డాక్టర్ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద ప్రదర్శనలను విద్యార్థులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ప్రదర్శనలను ప్రారంభించిన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ, ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌లు పలు స్టాల్స్‌కి వెళ్లి ప్రదర్శనలు తిలకించారు. పలు అంశాలపై ప్రదర్శకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థి అయిన రామ్‌గోపాల్‌వర్మ ట్రిపుల్‌ఈ, ఈసీఈ, సీఎస్ఈ, ఆర్కిటెక్చర్, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ విభాగాలలోని ప్రదర్శనలను పరిశీలించి ప్రదర్శనలు చేస్తున్న వారిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, అకడమిక్ ఎగ్జిబిషన్ కో-ఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు, ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు. యూనివర్సిటీలో తుదిమెరుగులు దిద్దుకుంటున్న బ్రూసలీ కళారూపాన్ని రామ్‌గోపాల్‌వర్మ ఆసక్తిగా పరిశీలించారు. చాలా బాగుందని కితాబిచ్చారు.



ప్రదర్శనలను పరిశీలిస్తున్న సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ

ప్రపంచం మనవైపు ఆసక్తిగా చూస్తోంది...

ప్రారంభోత్సవ సభలో గౌరవ అతిథిగా హాజరైన ఎస్ఆర్ఎం, ఏపీ యూనివర్సిటీ ప్రో వైస్‌చాన్స్‌లర్ ఆచార్య డి.నారాయణరావు ప్రసంగిస్తూ యువత అధికంగా ఉన్న భారత్‌వైపు ప్రపంచం ఆసక్తిగా చూస్తోందన్నారు. పలు అంశాల్లో అద్భుతాలు సృష్టించగల నైపుణ్యం మన యువతకు ఉందన్నారు. నూతన ఆవిష్కరణలు, దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదం చేసే అంశాలకు అకడమిక్ ఎగ్జిబిషన్‌లో పెద్దపీట వేయడం అభినందనీయమన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రసంగిస్తూ అకడమిక్ ఎగ్జిబిషన్ చారిత్రక ఘట్టమన్నారు.

పవనిజం అంటూ అరిపించుకుని ఆనందించేవాడిని కాను

రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతున్నపుడు వర్మ, వర్మ అని విద్యార్థులు కేకలు వేస్తుండగా తనకు అలాంటివి ఇష్టం ఉండదని, పవనిజం, పవనిజం అని అరిపించుకుని ఆనందించేవాడిని తాను కాదన్నారు. ఇంజినీరింగ్‌లో వెనకబెంచిలో కూర్చుని నవలలు చదవడానికే కాలేజీకి వెళ్లేవాడినన్నారు. విద్యార్థులు మహిళా సాధికారిత గురించి ప్రశ్నించగా సాధికారత కంటే అందాన్ని ఎక్కువగా ఆస్వాదిస్తానని తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

వాగులోకి దూసుకెళ్లిన కూలీల వాహనం



చినగంజాం: కూలీలను తీసుకెళుతున్న వాహనం వాగులోకి దూసుకుపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెదగంజాం ఎస్సీ కాలనీకి చెందిన పచ్చాకు ముఠా కూలీలు మినీ ట్రక్కులో బుధవారం నాగులుప్పలపాడు మండలం ఓబన్న పాలెంలో కూలీ పనుల నిమిత్తం వెళుతున్నారు. వాహనంలో సుమారు 18 మంది ప్రయాణిస్తుండగా ఉప్పుగుండూరు వద్దకు వచ్చే సరికి టైరు పగలడంతో వాహనం పక్కనే ఉన్న నాగన్న వాగులోకి దూసుకుపోయింది. నలుగురికి స్థానిక ప్రవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నాటికలతో సామాజిక చైతన్యం

మార్టూరు: గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర దశాబ్దాలుగా కళాసేవ చేస్తున్న శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు అభినందనీయులని విశ్రాంత ఐఏఎస్ అధికారి జి.బలరామయ్య అన్నారు. మార్టూరులో కళాపరిషత్ నాటికల పోటీలు బుధవారానికి రెండో రోజుకు చేరాయి. కార్యక్రమాన్ని శివశక్తి బయోటెక్ ఎండీ నందిగం శ్రీనివాసరావు, శ్రీకారం అధ్యక్ష, కార్యదర్శులు కందిమళ్ల సాంబశివరావు, జాష్టి అనూరాధ ప్రారంభించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ నాటక రంగానికి పూర్వ వైభవం రావటం కోసం మనందరం సమష్టి బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎఫర్ట్ డైరెక్టర్ కేవీ మోహనరావు, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొర్రపాటి ఖాజారావు, కుర్రా వెంకటరామయ్య, రోటరీ 3150 జిల్లా మాజీ గవర్నర్ అన్నే రత్నప్రభాకర్ పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

కళాపరిషత్ సభ్యులే నటులుగా ఎంవీ రమణయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన డబ్బుకు లోకం దాసోహం కారాదు గణనాథా అనే నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. మానవ సంబంధాల విలువను ఎలా తెలుసుకున్నాడనే ఇతి వృత్తంతో నాటిక ముగుస్తుంది. అద్దేపల్లి, ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి శవరంజని నాటిక లక్ష్మణ శాస్త్రి దర్శకత్వంలో ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కళావర్షిణి వీరన్నపాలెం వారు యార్లగడ్డ బుచ్చయ్య చౌదరి దర్శకత్వంలో ప్రదర్శించిన రాజరాజ చోరులు ఆకట్టుకుంది. శ్రీసద్గురు కళా నిలయం గుంటూరు వారి కమనీయం నాటికను బసవరాజు దర్శకత్వంలో ప్రదర్శించారు.



డబ్బుకు లోకం దాసోహం నాటికలో ఓ సన్నివేశం

కస్టమ్స్ ప్రధాన కమిషనర్ రఘురామిరెడ్డికి సన్మానం



పాత గుంటూరు: నగరంపాలెంలోని కస్టమ్స్, సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో ప్రధాన కమిషనర్ మన్నెం రఘురామిరెడ్డిని ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, కమిషనరేట్లలో కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రధాన కమిషనర్‌గా ఇటీవల ఉద్యోగోన్నతి పొందారు. బుధవారం కమిషనర్ రఘురామిరెడ్డి, గుంటూరు కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఉద్యోగులు, ఆడిటర్స్, ఉద్యోగ సంఘాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్లు విల్సన్‌బాబు, సూపరింటెండెంట్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గాదె శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు



గిత్తలను తోలుతూ సై అంటున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల



ఉత్సాహంగా బండ లాగుతున్న ఎడ్లు

- పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల
- ఉత్సాహంగా తిలకించిన ప్రజలు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వెలుగొండ క్షేత్రంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉడుముల మాట్లాడుతూ ఇది రైతు రాజ్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నీ విధాలా రైతులను ఆదుకొనేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పశు ప్రదర్శన పోటీలు రైతులకు ఎంతగానో ఉత్సాహం నింపుతాయన్నారు. తొలుత ఆలయ కమిటీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఎడ్ల పోటీల ప్రారంభానికి వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులకు, మాజీ ఎమ్మెల్యేకు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు.

ఉత్సాహంగా రెండు పళ్ల సైజు ఎడ్ల పోటీలు..

ఉదయం రెండు, సాయంత్రం ఆరు పాలపండ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తిరుపతిరెడ్డి, మేకలవారిపల్లి రెడ్ల సంఘం ఆధ్వర్యంలో పోటాపోటీగా నిర్వహించిన పోటీలను తిలకించటానికి రైతులు భారీ సంఖ్యలో వెలుగొండకు తరలివచ్చారు. రెండు, ఆరు పాలపళ్ల సైజు ఎడ్ల పోటీల్లో ప్రకాశం, గుంటూరు, కృష్ణా, కర్నూలు జిల్లాల నుంచి మొత్తం 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఎడ్ల పందేలకు వ్యాఖ్యాతలుగా, రిఫరీలుగా వెంటరామిరెడ్డి, ఎల్‌వీసీ వెంకటరెడ్డి, బ్రహ్మరెడ్డి వ్యవహరించారు.

సత్తా చాటిన ప్రత్తిపాడు, అబ్బూరు గిత్తలు..

రెండు పళ్లసైజు ఎడ్ల పోటీల్లో మొత్తం 6 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన నక్కా బలరామకృష్ణకు చెందిన సంయుక్త ఎడ్లజత నిర్ణీత సమయానికి 4,200 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి పొందాయి. వైఎస్సార్ కడప జిల్లా దాసరపల్లికి చెందిన శీలం రమేష్, మొలకుల వీరన్నయాదవ్‌ల ఎడ్ల జత 3,888 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా తిప్పాయపాలెం, ఔరంగాబాద్‌కు చెందిన సింగారెడ్డి శ్రీనివాసరెడ్డి, రామోజీల సంయుక్త ఎడ్లజత 3,285 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా మామిళ్లపల్లికి చెందిన బి.శంకరయ్య ఎడ్ల జత 3241 అడుగులు లాగి నాలుగో స్థానం సాధించాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా నాలుగు బహుమతులను రూ.20, రూ.15, రూ.10, రూ.5 వేలను దాతలు అందజేశారు.

పూడ్చిన మృత దేహానికి పోస్టుమార్టం



మృతి చెందిన బిళ్లా రాజేష్ (ఫైల్)

మేదరమెట్ల: కొద్ది రోజుల క్రితం పూడ్చి పెట్టిన మృత దేహాన్ని బయటకు తీసి పోస్టు మార్టం నిర్వహించారు. ఈ ఘటన మండలంలోని పమిడిపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. డెప్యూటీ తహసీల్దార్ రాజశేఖర రెడ్డి తెలిపిన వివరాలు.. పమిడిపాడు గ్రామానికి చెందిన బిళ్లా రాజేష్ (31) పొగాకు బ్యారన్ పనుల నిమిత్తం ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం గ్రామానికి వెళ్లాడు. ఈనెల 3న రాజేష్ గుండెపోటుతో మృతి చెందినట్లు అక్కడి రైతులు రాజేష్ కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువచ్చి పమిడిపాడులో అంత్యక్రియలు నిర్వహించారు. కొద్ది రోజుల తరువాత రాజేష్ కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ప్రకాశం జిల్లా ఎస్పీకి వారం క్రితం ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గుడ్లూరు సీఐ ఆధ్వర్యంలో రిమ్స్‌కు చెందిన వైద్య బృందం పమిడిపాడు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. నివేదిక వచ్చిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీటీ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి



మృతి చెందిన బాల గంగాధరరావు

చీరాల రూరల్: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సిహెచ్. కొండయ్య తెలిపిన వివరాలు.. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరి పట్నం స్పిన్నింగ్ మిల్ ఎదురుగా నివాసముంటున్న కొలుకుల బాల గంగాధర రావు(41) సికిందరాబాద్ వెళ్లేందుకు బుధవారం రాత్రి చీరాల రైల్వే స్టేషన్‌లో సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రైలు ప్లాట్‌ఫాం దాటుతుండగా రైలు నుంచి జారి కిందపడ్డాడు. ఈ క్రమంలో తీవ్రంగా గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

వేటపాలెం: గ్రామానికి చెందిన వెంకట్ గొంతు కోసుకొని ఆత్మహత్యా యత్నం చేసుకున్న ఘటన స్థానిక రైల్వే స్టేషన్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకట్ బేల్దారీ పనులు చేసుకుంటుంటాడు. అయితే రైల్వే స్టేషన్ వద్ద మరో యువకుడితో కలసి మద్యం తాగాడు. మద్యం మత్తులో ఇద్దరూ గొడవ పడ్డారు. ఇది గమనించిన స్థానికులు గణపతి వారిద్దరినీ మందలించాడు. దీంతో వెంకట్ అవమానంతో పక్కనే దుకాణంలో బ్లేడు కొనుగోలు చేసి గొంతు కోసుకొని పడిపోయాడు. స్థానికులు 108కి సమాచారం అందించగా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ జి.సురేష్ పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఆడిట్ జూనియర్ అసిస్టెంట్ మృతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న జీఎస్టీ కార్యాలయంలో ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ వినోద్ తెలిపిన వివరాలు.. ఆడిట్ అసిస్టెంట్‌గా ముస్తా షరీఫ్(40) పనిచేస్తున్నాడు. కుంచనపల్లిలో నివాసముంటున్న షరీఫ్ మంగళవారం రూమ్‌కు వెళ్లి ఏలూరులో ఉంటున్న భార్య షాకిరాతో మాట్లాడి పడుకున్నాడు. తెల్లవారిన తరువాత భార్య ఫోన్ చేసినా తీయలేదు. దీంతో షరీఫ్ భార్యకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన షకీరా ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపు బద్దలుకొట్టి చూడగా తన భర్త రక్తం కక్కుకుని చనిపోయినట్లు గుర్తించి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్ తెలిపారు.

తాడేపల్లిలో వరిగడ్డి వామి దహనం

- 78 ఎకరాలు గడ్డికి మంటలు
- 10 గంటలు శ్రమించి ఆర్పిన మంగళగిరి ఫైర్ సిబ్బంది



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: వరిగడ్డి వామిని దహనం చేసిన ఘటన బుధవారం తాడేపల్లి మదర్ థెరిసా కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాలనీలోని బీటీ రోడ్డు పక్కన భీమిరెడ్డి నాగచౌదరి రెడ్డి, భీమిరెడ్డి చరణ్‌కుమార్ రెడ్డికి చెందిన ఆవుల ఫారం ఉంది. వీరికి 78 ఎకరాల గడ్డి ఉంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో నాలుగువైపులా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. యజమానులు మంగళగిరి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి పది నిమిషాలలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయడానికి కష్టపడ్డారు. తహసీల్దార్ నాగిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీఈ అక్కల సత్యనారాయణను ఆదేశించారు.

సోషల్ మీడియాలో పోస్టులతో..

ఈ సందర్భంగా భీమిరెడ్డి నాగచౌదరి రెడ్డి మాట్లాడుతూ ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మూగ జీవాలు తినే వరిగడ్డి వాముకు నాలుగు వైపులా నిప్పు పెట్టడంతో మంటలను అదుపుచేయలేకపోయినట్లు చెప్పారు. రెండు రోజుల క్రితం నుంచి రాజకీయంగా కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం జనసేన ఆవిర్భావ దినోత్సవ మీటింగ్ సందర్భంగా కొన్ని వాస్తవాలను సోషల్ మీడియాలో పెట్టామని, ఉద్దేశ పూర్వకంగానే ఇలాంటి చర్యలు స్థానికంగా ఉన్న కొంతమంది జనసైనికులు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం పంటపొలంలో విద్యుత్ మోటారు భద్రత కోసం ఏర్పాటు చేసిన 50 కిలోల ఐరన్ రేకును దొంగిలించారని, రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప మూగజీవాలకు ఆహారమైన వరిగడ్డి వాములపై ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు పాల్పడకూడదని ఆయన పేర్కొన్నారు. ఘటనపై తాడేపల్లి సీఐ శేషగిరిరావు విచారణ చేపట్టారు. తగలబడిన 78 ఎకరాల వరిగడ్డి వాము రూ.17 లక్షలు ఉంటుందని చెబుతున్నారు.


మిర్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

మిర్చి యార్డు చైర్మన్ సుధాకరరెడ్డి



కొరిటెపాడు(గుంటూరు): మిర్చి పంటను అమ్ముకోవడానికి తీసుకువచ్చే మిర్చి రైతులకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా చూస్తామని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకరరెడ్డి పేర్కొన్నారు. యార్డు అధికారులతో కలసి బుధవారం యార్డులో విస్తృతంగా పర్యటించారు. కమీషన్ షాపుల వద్ద మిర్చి నాణ్యతను పరిశీలించారు. మిర్చి రైతుల సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకరరెడ్డి మాట్లాడుతూ యార్డుకు వచ్చే మిర్చి రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతులకు ఉచితంగా నాణ్యమైన రుచికరమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. రైతు విశ్రాంతి భవనంలో అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని చెప్పారు. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మిర్చి రైతులు తమ సరుకుతో పాటే వచ్చి మిర్చి బస్తాలను విక్రయించుకుని వెళ్లాలని సూచించారు. మిర్చి సీజన్ కావడంతో యార్డుకు భారీగా మిర్చి బస్తాలు తరలి వస్తున్నాయని, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వ్యాపారులు ఏ రోజు కొనుగోలు చేసిన మిర్చి బస్తాలను ఆ రోజే బయటకు తరలించాలని ఆదేశించారు. యార్డులో పర్యటించిన వారిలో యార్డు ఇన్‌చార్జి శివారెడ్డి ఉన్నారు.

విజ్ఞాన పండుగ









ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరుగుతున్న అకడమిక్ ఎగ్జిబిషన్‌ను బుధవారం చిత్రదర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవరణలో ఏర్పాటు చేసిన బ్రూస్‌లీ కళారూపం వద్ద రామ్‌గోపాల్‌వర్మ, వీసీ ఆచార్య రాజశేఖర్ తదితరులు, ప్రదర్శనలో ఉంచిన వివిధ ఛాయాచిత్రాలు. - ఏఎన్‌యూ